ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 27 జూలై 2024



క్షయ నియంత్రణ విభాగంలో పోస్టుల భర్తీకి రీ నోటిఫికేషన్

పార్వతీపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో ఐదు పోస్టుల భర్తీకి రీ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఉమ్మడి జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి కె.రాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యాధికారి, జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, డాట్స్ టీబీ-హెచ్ఐవీ సూపర్‌వైజర్ (టీపీఎం కో-ఆర్డినేటర్), అకౌంటెంట్ తదితర పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు వచ్చేనెల ఒకటో తేదీలోగా విజయనగరంలోని లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.



పోస్టింగ్‌ల కోసం పైరవీలు!

- స్వస్థలాలకు రాకనే కొంతమంది తహసీల్దార్ల ప్రయత్నాలు
- తమకు అనుకూల మండలాల కోసం తాపత్రయం
- అధికారపార్టీ ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- గత ఐదేళ్లూ వైసీపీ సేవలో.. తాజాగా టీడీపీ జపం
- వారిపై ఆచితూచి వ్యవహరించాలంటున్న కూటమి శ్రేణులు

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లిన 'మన్యం' తహసీల్దార్లు త్వరలోనే సొంత జిల్లాకు రానున్నారు. దీనికి సంబంధించిన ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. అయితే ఇదే సమయంలో కొందరు తహసీల్దార్లు పైరవీలు ప్రారంభించారు. 'మన్యం'లో తమకు కావల్సిన మండలాలపై గురిపెట్టారు. ఈ మేరకు ఇతర జిల్లాల నుంచే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మరి కొంతమంది జిల్లాలో ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు అనుకూలమైన ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వాలని కోరుతున్నారు. అయితే గత ఐదేళ్లు.. వైసీపీ సర్కారు సేవలో తరించిన సంబంధిత అధికారులపై అప్రమత్తంగా ఉండాలని కూటమి శ్రేణులు చెబుతున్నాయి. అన్ని కోణాల్లో విచారణ చేపట్టిన తర్వాతే.. వారికి మండలాలను కేటాయించాలని ఎమ్మెల్యేలకు సూచిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

వాస్తవంగా గత వైసీపీ సర్కారు హయాంలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కొంతమంది తహసీల్దార్లు ఆ పార్టీ నాయకుల్లా వ్యవహరించారు. ఏ మాత్రం భయం లేకుండా కొన్ని మండలాల్లో వైసీపీ రెవెన్యూ చట్టాన్నే అమలు చేశారు. ప్రభుత్వం ఉద్యోగులమని మరిచిపోయి.. నిబంధనలకు విరుద్ధంగా నడిచారు. అక్రమాలపై ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు దిగారు. అక్రమార్కులకు కొమ్ము కాశారు. బాధితులకు అన్యాయం చేశారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే వైసీపీ నేతలకు తొత్తులుగా వ్యవహరించారన్న ఆరోపణలు లేకపోలేదు. జిల్లాలో అనేకచోట్ల చెరువులు, ప్రభుత్వ భూములను కొందరు వైసీపీ నాయకులు ఆక్రమించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కొన్ని నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేల ఆదేశాల ప్రకారం కొంతమంది తహసీల్దార్లు రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారనే ఆరోపణలున్నాయి. దీంతో విలువైన ప్రభుత్వ భూములు చేతులు మారాయనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మొత్తంగా గత ఐదేళ్లలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కొంతమంది తహసీల్దార్ల తీరును ఇప్పటికీ కూటమి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి.



అప్పట్లో వైసీపీ.. తాజాగా టీడీపీ

వైసీపీ ప్రభుత్వ కాలంలో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లా వ్యవహరించిన కొంతమంది తహసీల్దార్లు తాజాగా టీడీపీ నామం జపిస్తున్నారు. ఎన్నికల విధులు ముగించుకుని సొంత జిల్లాలకు తరలివస్తున్న తరుణంలో అనుకూల మండలాల్లో పోస్టింగ్‌ల కోసం పైరవీలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో వారికి పరిచయం ఉన్న టీడీపీ నాయకులతో మాట్లాడుతున్నారు. మరోవైపు కీలక నేతలు, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. మరి కొందరు కులం కార్డును ఉపయోగిస్తున్నారు. కాగా వైసీపీ సర్కారు హయాంలో ఆయా తహసీల్దార్ల పనితీరును గుర్తు చేసుకుని.. పోస్టింగ్‌ల విషయంలో కఠినంగా వ్యవహరించాలని కూటమి శ్రేణులు ఎమ్మెల్యేలకు సూచిస్తున్నాయి. ద్వితీయ శ్రేణి నాయకులు మాటలు వినొద్దని.. అధికారుల నియామకం విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని కోరుతున్నాయి. అధికారుల నిజాయితీ, వారి చరిత్ర, వ్యవహార శైలి తదితర అంశాలను పరిగణ లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

గాడి తప్పిన రెవెన్యూ వ్యవస్థ..

గత వైసీపీ సర్కారు తీరుతో జిల్లాలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని చెప్పొచ్చు. నిబంధనల ప్రకారం విధులు నిర్వహించే కొంతమంది తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది కూడా గత ఐదేళ్లూ కొంతమంది వైసీపీ ఎమ్మెల్యేల కారణంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవల్సి వచ్చింది. సదరు ఎమ్మెల్యేలు చెప్పినట్టు వినని తహసీల్దార్లపై ఉన్నత స్థాయి అధికారుల ద్వారా ఒత్తిడి పెంచి వైసీపీ రెవెన్యూ చట్టం అమలయ్యేలా చేశారనే ఆరోపణలున్నాయి.

● ఏదేమైనా జిల్లాలో కొంతమంది తహసీల్దార్లు నిజాయితీగా పనిచేస్తారన్న పేరుంది. అటువంటి వారికి పోస్టింగ్‌లు ఇచ్చే విషయంలో ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. అంతేగాకుండా గత వైసీపీ ప్రభుత్వ కాలంలో జరిగిన భూ కుంభకోణాలు, చెరువులు, బందల ఆక్రమణలపై తహసీల్దార్లు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని, ప్రభుత్వ భూములను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.



అసెంబ్లీలో జిల్లా సమస్యల ప్రస్తావన

- సభ దృష్టికి తీసుకెళ్లిన మంత్రి, ఎమ్మెల్యేలు

పార్వతీపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి)/ సాలూరు/ పార్వతీపురం రూరల్/ గుమ్మలక్ష్మీపురం: జిల్లా ఎమ్మెల్యేలు శుక్రవారం అసెంబ్లీలో తమ వాణి వినిపించారు. మన్యంలో ప్రధాన సమస్యలపై ప్రస్తావించారు. సాలూరు ఎమ్మెల్యే, స్త్రీశిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, పార్వతీపురం, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణలు తమ నియోజకవర్గాల్లో నెలకొన్న పరిస్థితులను వివరించారు. సాలూరు నియోజకవర్గంలో 31 గ్రామాల తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.మూడు కోట్లు మంజురు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సంధ్యారాణి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఆ పనులు మొదలుపెడతామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సాలూరులో వంద పడకల ఆసుపత్రి పనులు పూర్తి చేయలేక పోయిందని విమర్శించారు. ఫీడర్ అంబులెన్స్‌లు, వైటీసీలను నిర్వీర్యం చేసిందన్నారు. గోతులతో నిండిన రోడ్లు.. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయని తెలిపారు. ఎన్నికల హామీ ప్రకారం సూపర్‌సిక్స్ పథకంలో భాగంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున సంవత్సరానికి రూ.18వేలు ఇస్తామని తెలిపారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్యసేవలపై పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రస్తావించారు. రోగుల ఇబ్బందుల దృష్ట్యా తక్షణమే ప్రత్యేక వైద్య నిపుణులను నియమించాలన్నారు. వైద్య కళాశాల ఏర్పాటుతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చూడాలని, ఆసుపత్రులను సెంట్రలైజ్ చేయాలని కోరారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ.. ఏనుగుల తరలింపుతో పాటు గిరిజన, మైదాన ప్రాంతాల ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ఆసుపత్రుల్లో మందులు, పడకల కొరత, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎంల నియామకం విషయాన్ని సభ దృష్టికి తెచ్చారు. తోటపల్లి ప్రాజెక్టు ఆధునీకరణ పనులు పూర్తయ్యేలా చూడాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. గత వైసీపీ సర్కారు హయాంలో నియోజకవర్గంలో ఇసుక మాఫియా ఏ విధంగా జరిగిందో వివరించారు.



జిల్లా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన మంత్రి, ఎమ్మెల్యేలు

విద్య, వైద్య సేవల మెరుగుకు

ప్రత్యేక కార్యాచరణ

- గిరిజన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు
- ఏజెన్సీలో రోడ్లకు అధిక ప్రాధాన్యం
- సీతంపేట ఐటీడీఏ నూతన పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి

సీతంపేట, జూలై 26: సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజనులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విద్య, వైద్యం పూర్తిస్థాయిలో అందజేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంట లకు ఐటీడీఏ పీవోగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూ... 'గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే విద్య వైద్యం రహదా రులు మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే తొలి ప్రాధాన్యంగా వాటిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తాం. ఇప్పటికే సీతంపేట మండలంలో మలేరియా కేసులు అధికంగా నమోదు అవుతున్నాయి. వాటి నివారణకు చర్యలు తీసుకుంటూ.. గ్రామస్థాయిలో గిరిజనులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా నిర్వహిస్తాం. అవసరమైతే దోమతెరలు పంపిణీ చేస్తాం. గిరిజన ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌పై దృష్టి సారిస్తాం. గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తాం. వందన్ వికాస్ కేంద్రాలు సక్రమంగా నడిచేలా చూస్తాం. ఐటీడీఏ పరిధిలో ఉన్న 1200 గిరిజన గ్రామాల భౌగోళిక పరిస్థితులు తెలుసుకుంటాం. ఆయా ప్రాంతవాసుల జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటాం. గిరిజనుల వినతులు స్వీకరించడానికి గ్రామస్థాయిలో ఏర్పాట్లు చేస్తాం. ప్రతి వినతికి జవాబుదారీ తనం ఉండేలా చూస్తాం. అన్ని శాఖల్లో రెగ్యులర్ ఉద్యోగులను నియమిస్తాం. జలజీవన్‌మిషన్ పథకం కింద ప్రతి గిరిజన గ్రామాలకు తాగునీరు సౌకర్యం కల్పిస్తాం.' అని పీవో తెలిపారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఐటీడీఏ కార్యాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు.



● సీతంపేటలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర ఆలయాన్ని పీవో సందర్శించారు. అక్కడి నుంచి పార్వతీపురం చేరుకుని కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఐటీడీఏ పరిధిలో గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ఆయనకు సూచించారు.

మాతా శిశు మరణాలు సంభవించకూడదు..

గిరిజన ప్రాంతాల్లో మాతా శిశు మరణాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో 29 పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ జ్వరాల వల్ల మరణాలు సంభవిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి తదితరులు పాల్గొన్నారు.

భూసాగు పత్రాలు

అందించాలి

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్

సీతానగరం, జూలై 26 : కౌలు రైతులకు భూసాగు పత్రాలు అందించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్‌పాల్ ఆదేశించారు. శుక్రవారం బర్లి గ్రామంలో కౌలు రైతులకు భూసాగు హక్కు పత్రాల ఆవశ్యకతను తెలియజేశారు. ఎంత భూమిని సాగు చేస్తున్నారో సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారికి తెలియజేయాలని సూచించారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులతో సమీక్షించారు. భూసాగు హక్కు పత్రాలు వేగంగా జారీ చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఆతర్వాత నారాయణపురం, మిర్తివలస గ్రామాల్లో పర్యటించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో సక్రమంగా పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. బలిజిపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఓపీ రిజిస్టర్, ఇతర సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా..

- స్త్రీనిధి రుణ పరిమితిని పెంచిన టీడీపీ కూటమి ప్రభుత్వం
- ఉపాధి అవకాశాల మెరుగుకు దోహదం
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు

కొమరాడ, జూలై 26: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు టీడీపీ కూటమి సర్కారు తీపి కబురు అందించింది. వారి ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచాలనే ఉద్దేశంతో గతంలో కంటే మరింతగా రుణ సాయాన్ని పెంచింది. స్త్రీనిధి రుణ పరిమితిని సంఘానికి రూ. 3.50 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచింది. దీంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు లింకేజీతో సంబంధం లేకుండా ఉపాధి మార్గాలను ఇంకా మెరుగుపరుచుకోవడానికి స్త్రీనిధి రుణాలు ఉపకరిస్తాయని వారు భావిస్తున్నారు. వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి బయట అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన అవసరం ఉండదని మహిళా సంఘాల సభ్యులు చెబుతున్నారు.



సంఘాలకు గ్రేడ్లు

జిల్లాలో గ్రామ సమ్మెక్య సంఘాలు 565, స్వయం సహాయక సంఘాలు 19,770 ఉండగా.. 2,29,847 మంది వరకు సభ్యులు ఉన్నారు. కాగా గ్రామ సమ్మెక్యకు గ్రేడింగ్ ఆధారంగా రుణ ప్రక్రియ ఉంటుంది. గ్రేడ్-ఏ అయితే రూ. 75 లక్షలు, గ్రేడ్-బీ అయితే రూ. 65 లక్షలు, గ్రేడ్-సీ అయితే 55 లక్షలు, గ్రేడ్-డీ అయితే రూ. 45 లక్షలు వరకు రుణం అందిస్తారు. దీంతో పాటు ప్రతి వెయ్యి రూపాయలకు రూ. 4 చొప్పున బీమా ఉంటుంది. ఒకవేళ సభ్యురాలు మరణిస్తే తీసుకున్న రుణాన్ని పూర్తిగా మాఫీ చేస్తారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 52 కోట్లు లక్ష్యంగా నిర్ణయించినట్లు అధికారులు చెబుతున్నారు.

నేరుగా ఖాతాల్లో జమ

గత వైసీపీ సర్కారు పాలనలో పొదుపు సొమ్ము జమ చేయడంలో అనేక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలు ప్రోత్సహించేలా.. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమయ్యేలా చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా కొందరు వీవోఏలకు పేటీఎం పరికరాలు అందజేయనున్నట్లు సమాచారం. వీటి ద్వారా సభ్యులకు నేరుగా రుణం చెల్లించనున్నారు. ఏదేమైనా స్త్రీనిధి రుణాలను రూ. 5లక్షల వరకు పెంచడం తో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధిని మెరుగుపర్చుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం స్త్రీనిధి రుణ సహాయాన్ని రూ. 5 లక్షలకు పెంచింది. సంఘాల సభ్యులు పెంచిన రుణాన్ని పొంది.. వారి ఉపాధిని మెరుగుపర్చుకోవాలి. జిల్లాలో ఇప్పటివరకు రూ. 11 కోట్ల మేర రుణాలు మంజూరు చేశాం. లక్ష్య సాధనపై దృష్టి సారించాం. నిబంధనలను అనుసరించి రుణాలు మంజూరు చేస్తాం.

- హేమలత, స్త్రీనిధి ఏజీఎం, పార్వతీపురం మన్యం జిల్లా

రెవెన్యూ కార్యాలయాలపై నిఘా

- రికార్డు రూముల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు
- మదనపల్లె ఘటన నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

మెంటాడ, జూలై 26: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్ కార్యాలయాన్ని తగలబెట్టిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో సీసీ కెమెరాలను తక్షణమే ఏర్పాటు చేయాలని టీడీపీ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. త్వరలోనే ఇవి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలోని కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రత్యేకంగా రికార్డు రూముల వద్ద సీసీ కెమెరాలు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలకు ముందు, తర్వాత రాష్ట్రంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కీలక రికార్డులు మాయమవుతు న్నాయి. ఈ ఘటనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలోనే అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి మూడు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ కార్యాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకోసం వీఆర్ఏల సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సైనికుల త్యాగాలు మరువలేం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- అమరవీరులకు ఘన నివాళి

పార్వతీపురం టౌన్, జూలై 26 : దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీర సైనికుల త్యాగాలు మరువలేమని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. బీజేపీ యువమోర్చా, మాజీ సైనికుల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ ప్రాంగణంలో కార్గిల్ విజయ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాజరై.. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్గిల్ యుద్ధంలో సైనికులు ప్రాణాలకు తెగించి పోరాడి.. విజయం సాధించారని తెలిపారు. భారత సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా విజయ్ దివాస్ జరుపుకుంటున్నామన్నారు. సైనికుల త్యాగాలను మననం చేసుకుని.. దేశరక్షణ, అభివృద్ధికి యువత పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, మాజీ సైనికుల సంఘ నాయకులు కె.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని బెలగాం చర్చివీధిలోని గ్రంథాలయంలో విజ్ఞాన వికాస కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని సూచించారు. జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలు, పట్టణాల్లో పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థుల కోసం విజ్ఞాన వికాస కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తామని, ఉద్యోగ నోటిఫికేషన్లు, పరీక్షలకు సంబంధించి దరఖాస్తులు మెటీరియల్ డౌన్‌లోడ్ ప్రక్రియ నిర్వహి స్తామన్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కేంద్రాలు తెరిచి ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వీర జవానుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

పార్వతీపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తానని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పోరాడిన సైనికులతో కలెక్టర్ మాట్లాడి.. నాటి విషయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున పథకాల అమలు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం గౌరవ అధ్యక్షుడు టి.చంద్రశేఖరరావు, అధ్యక్షుడు కైలాసరావు, సభ్యులు జైశ్రీరామ్, భాస్కరరావు, రామకృష్ణ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బొకేలు వద్దు..

తనను కలవడానికి వచ్చేవారు బొకేలు తీసుకురావద్దని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఉట్టి చేతులతో రావానికి మొహమాట పడితే.. పోటీ పరీక్షలు, గ్రంథాలయాలకు ఉపయోగపడే పుస్తకాలు తెస్తే మంచిదన్నారు. వాటిని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే విజ్ఞాన కేంద్రాలకు అందిస్తామన్నారు. పుస్తకం దీర్ఘకాల జ్ఞాపకంగా నిలుస్తుందన్నారు.

ఓయూ కళాశాలల్లో బీఈ/బీటెక్ లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజ్ సహా వర్సిటీ అనుబంధ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రతి కళాశాలలో స్పెషలైజేషన్‌కు 30 సీట్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు ఉంటాయి. వారాంతాలు, సెలవు రోజుల్లో కూడా అందరి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్లాసెస్ నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000. వర్సిటీ నిబంధనల మేరకు ఇతర ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.



అర్హత: ఏదేని గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. చేరదలచుకున్న ఇంజనీరింగ్ కాలేజీకి 100 కి.మీ.ల పరిధిలో ఉన్న కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు/సంస్థల్లో పని చేస్తూ ఉండాలి. కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో స్పెషలైజేషన్‌కు సంబంధించి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 27
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** డిప్లొమా సర్టిఫికెట్-మార్కుల పత్రాలు, టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు.
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 4
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 8
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 17
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 24
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

దిక్సూచి
DIKSUCHI

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7kP3x2Cలో చదవండి.

కోటక్ కన్య స్కాలర్‌షిప్

కోటక్ మహీంద్రా గ్రూప్ కంపెనీలు, కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'కోటక్ కన్య స్కాలర్‌షిప్ 2024-25' నోటిఫికేషన్ వెలువడింది. ప్రతిభావంతులైన బాలికలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తూ వారికి ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కాలర్‌షిప్‌ను ఉద్దేశించారు. కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి పూర్తిచేసి గుర్తింపు పొందిన కాలేజీల్లో ఇంజనీరింగ్/మెడిసిన్/బీడీఎస్/ఫార్మసీ/ఆర్కిటెక్చర్/డిజైనింగ్ విభాగాల్లో డిగ్రీ ప్రవేశం పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ నర్సింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరినవారు; బెంగళూరు ఐఐఎస్సీ, ఐసర్ సంస్థల నుంచి ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్ అడ్మిషన్ పొందినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షలు మించకూడదు. ఎంపికైన బాలికలకు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఇంటర్నెట్, ల్యాప్‌టాప్, బుక్స్, స్టేషనరీ ఖర్చుల కింద ఏడాదికి రూ.లక్షన్నర ఇస్తారు. వార్షిక పరీక్షల్లో కనీసం 6 సీజీపీఏ సాధించేవారికి కోర్సు పూర్తయ్యేవరకూ స్కాలర్‌షిప్ కొనసాగిస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.kotak.com, www.b4s.in/it/kkgs2

పోటీ నీకే - జయం నీదే

కొత్త పుస్తకం


పోటీ పరీక్షలు అంటే గ్రామీణ యువతలో విపరీతమైన క్రేజ్ ఉంటుంది. అయితే వీరిలో ఎక్కువ మంది గ్రూప్స్, టీచర్ వంటి ఉద్యోగాల పట్ల దృష్టిపెడతారు కానీ సివిల్స్ గురించి ఆలోచించరు. రాయాలని ఉన్నా అవి పెద్ద పెద్ద పట్టణాల్లో చదువుకున్నవారికి లేదా టాప్ ర్యాంకర్లకు ఉద్దేశించిన ఉద్యోగాలని భావిస్తుంటారు. అలాంటి వారికి మార్గనిర్దేశం చేసేందుకు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రావులపాటి సీతారామారావు 'పోటీ నీకే - జయం నీదే' పేరుతో పుస్తకం రాశారు.

ఏదో పనిమీద బయటకు వెళ్లినప్పుడు తనను కలిసిన విద్యార్థులు, ఉద్యోగార్థులు పలు సందేహాలు వెలిబుచ్చేవారు. తను వారికి ఇచ్చిన గైడెన్స్ అందరికీ చేరాలనే ఉద్దేశంతో రచయిత ఈ పుస్తకం రాశారు.

విజయం సాధించాలంటే పెద్ద బ్యాక్‌గ్రౌండ్ ఉండాల్సిన పనిలేదు. ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని, దాని కోసం క్రమపద్ధతిలో కష్టపడాలని చెబుతారు. పోటీ పరీక్షల కోసం ప్లానింగ్ ఎలా చేసుకోవాలి? ఎన్ని గంటలు చదవాలి? పరీక్షల కోసం సిద్ధమయ్యే వారికి మెంటార్ అవసరమా? అని చెబుతూ తనతో సహా గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు సివిల్స్ వంటి పరీక్షల్లో ఎలా విజయం సాధించారో స్ఫూర్తి కలిగించేలా సవివరంగా చెప్పారు సీతారామారావు. పరీక్షలు రాసే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని అధిగమించిన తీరును పుస్తకంలో వివరించారు.

పరీక్షలకు సిద్ధంకావడానికి ముందే అకడమిక్ పరీక్షలకు, పోటీ పరీక్షలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా గ్రహించగలగాలి. చదువుకోవడానికి మూడ్ ఉండాలి, వారం-వర్జం లాంటివి చూసుకోవాలనే మూఢనమ్మకాలు దరిచేరనీయ వద్దు. లక్ష్యం పెద్దగా నిర్ణయించుకున్నప్పుడు అందుకు అనుగుణంగానే ప్రిపేర్ కావాలి అని చెబుతారు. సెల్ఫ్ మోటివేషన్ పొందడానికి ఏమి చేయాలి? కొంత మంది సివిల్స్ అభ్యర్థులు ఎలా మోటివేట్ అయ్యారు అని వివరించారు. ఇవి సివిల్స్ అభ్యర్థులకు మాత్రమే కాకుండా అన్ని పరీక్షల విద్యార్థులకు ఉపయోగపడతాయి. ఈ పుస్తకాన్ని సాహితి ప్రచురణలు వారు ప్రింట్ చేశారు.

వెల: రూ.90/-
ప్రతులకు: సాహితి ప్రచురణలు 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ-520 002.
ఫోన్: 8121098500



నవ్య | చిత్రజ్యోతి

ఆ పాటలో కేసీఆర్‌ను తలుచుకున్నామంతే!





రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని 'మార్ ముంతా ఛోడ్ చింతా' పాట వివాదంపై సంగీత దర్శకుడు మణిశర్మ స్పందించారు. ఆ పాటలో 'ఇప్పుడేం చేద్దాం' అంటూ కేసీఆర్ అన్న మాటను ఉపయోగించడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహించాయి. ఇటీవల ఇచ్చిన ఈ పాట గురించి ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో మణిశర్మ వివరణ ఇస్తూ 'సోషల్ మీడియాలో వచ్చే మీమ్స్ ఆధారంగా ఆ పాట ఉంటుంది. కేసీఆర్ అంటే అందరికీ గౌరవం. ఆయన సరదాగా చెప్పిన ఓ పదాన్ని ఇందులో తీసుకున్నామంతే. ఎవరినీ నొప్పించడం మా ఉద్దేశం కాదు. నా 27 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ నొప్పించలేదు. ఆ పాటలో కేసీఆర్‌ను ఒకసారి తలచుకున్నాం. కేవలం అది వినోదం కోసమే. దయచేసి అందరూ అలాగే భావించండి' అన్నారు. 'డబుల్ ఇస్మార్ట్' లోని మూడో పాట 'క్యా లఫ్డా' ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రామ్, హీరోయిన్ కావ్యా థాపర్ పోస్టర్ రొమాంటిక్‌గా ఉంది. ఆగస్టు 15న 'డబుల్ ఇస్మార్ట్' విడుదల కానుంది.

మనవడి స్కూలుకు రజనీ

పాఠశాలకు వెళ్లేందుకు మారాం చేసిన తన మనవడిని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ స్వయంగా స్కూల్‌కు తీసుకెళ్లి వదిలిపెట్టారు. మనవడితో కారులో రజనీ స్కూల్‌కు వెళుతున్న ఫోటోను ఆయన చిన్న కుమార్తె సౌందర్య శుక్రవారం సామాజికా మాధ్యమాల్లో షేర్ చేస్తూ.. 'ఈ రోజు నా కుమారుడు స్కూల్‌కు వెళ్లనని మొండికేయడంతో వాడి సూపర్ హీరో తాత



(రజనీ) పాఠశాలకు స్వయంగా తీసుకెళ్లారు. వెండితెర అయినా, నిజజీవితంలో అయినా ఎలాంటి పాత్రనైనా నా తండ్రి అద్భుతంగా పూర్తి చేస్తారు' అని పేర్కొన్నారు. కాగా, సౌందర్య కుమారుడు వేద్‌ను పాఠశాల తరగతి గదిలోకి తీసుకెళ్ళిన రజనీకాంత్‌ను ఇతర పిల్లలు సంభ్రమాశ్చర్యాలతో చూశారు. వెండితెరవేల్పు రజనీ తమ కళ్లముందు ప్రత్యక్షమవ్వడంతో వారి ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఇదిలావుంటే, 'వేట్టయాన్' సినిమా పూర్తి చేసిన రజనీకాంత్ ఇపుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో గ్యాప్ లభించడంతో ప్రస్తుతం ఆయన స్థానిక పోయెస్ గార్డెన్‌లో ఉన్న తన నివాసంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి, (చెన్నై)

షారుక్ ఖాన్ రూ.40 కోట్లు.. అమితాబ్ రూ.30 కోట్లు...

అనంత్ అంబానీపై సినీ సెలెబ్రిటీల కానుకల వర్షం...



ఆభరణాల సెట్

అమితాబ్ బచ్చన్ దంపతులు, అభిషేక్, ఐశ్వర్య కలసి ఈ వధూవరులకి రూ.30 కోట్ల విలువైన ఆభరణాల సెట్‌ను (పచ్చల హారాన్ని) బహుమతిగా ఇచ్చారు.




ఇటీవలే అంగరంగ వైభవంగా జరిగిన అనంత్ అంబానీ, రాధిక మర్చంట్‌ల వివాహం.. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అత్యంత ఖరీదైన పెళ్లిళ్లలో ఒకటిగా నిలిచిపోయింది. ఈ చిరకాల వేడుకకు అంబానీ కుటుంబం చేసిన హంగామాని ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారు. ఆకాశంలో చంద్రుడు చుట్టూ ఉన్న అసంఖ్యాక తారల్లా.. అంబానీ పెళ్లిలో అనేక రంగాల్లోని అగ్ర తారలందరూ సందడి చేసి దేదీప్యమానంగా వెలుగులు విరబూశారు. ఈ విలాసవంతమైన పెళ్లికి అదిరిపోయే రేంజ్‌లో అత్యున్నతమైన ఏర్పాట్లకు తోడు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ తారలు హాజరవడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకకు వచ్చిన కొందరికి అంబానీ కుటుంబం అతిథి మర్యాదలతో దాదాపు రూ.రెండు కోట్ల విలువ చేసే వాచీలను గిఫ్ట్‌గా ఇచ్చారు. అలాగే సినీ సెలబ్రిటీలు కూడా ఈ కొత్త జంటకు కానుకలు అందించడానికి క్యూ కట్టడం విశేషం. మిగతా పరిశ్రమల నటీనటులు ఏయే బహుమతులు ఇచ్చారో తెలియదు కానీ.. బాలీవుడ్ తారలు ఇచ్చిన బహుమతుల వివరాలు ఒక్కొక్కటే బయటకు వస్తున్నాయి. ఎవరు ఏమేమిచ్చారో ఇప్పుడు తెలుసుకుందాం.



రూ.40 కోట్ల విల్లా

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఈ నూతన జంటకు ఫ్రాన్స్‌లో రూ.40 కోట్లు ఖరీదు చేసే ఓ విలాసవంతమైన భవంతిని కానుకగా ఇచ్చారు.



రూ.20 కోట్ల రోల్స్ రాయిస్

'కల్కి 2898 ఏ.డీ'తో తెలుగువారికి చేరువైన దీపికా పదుకొనే, తన భర్త రణ్‌వీర్ రూ.20 కోట్లు పెట్టి ఓ రోల్స్ రాయిస్ కారును వెడ్డింగ్ ప్రజంటేషన్‌గా ఇచ్చారు.




రూ.15 కోట్ల బైక్

సల్మాన్ ఖాన్ రూ.15 కోట్ల విలువైన స్పోర్ట్స్ బైక్‌ను కానుకగా ఇచ్చారు.

రూ.తొమ్మిది కోట్ల మెర్సిడెస్

రణ్‌బీర్ కపూర్, అలియా భట్ జంట ఈ కపుల్‌కు రూ.తొమ్మిది కోట్ల విలువైన మెర్సిడెస్ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు.









వీరితో పాటు, అక్షయ్ కుమార్ రూ.60 లక్షలు విలువ చేసే బంగారపు పెన్నును.. సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ దంపతులు రూ.25 లక్షలు విలువ చేసే హ్యాండ్ మేడ్ శాలువాను.. విక్కీకౌశల్, కత్రినా కైఫ్ దంపతులు రూ.19 లక్షల బంగారు గొలుసును బహూకరించారు.

మూడేళ్ల కష్టం.. కమిటీ కుర్రోళ్లు



అంతా కొత్తవారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం హీరో సిద్ధు జొన్నలగడ్డ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదు. ఓ సినిమాకు ఎక్కువ ఖర్చు పెడతాం, మరో చిత్రానికి తక్కువ ఖర్చు పెడతాం.. తేడా అంతే. ఈ సినిమాలో విజువల్స్ బాగున్నాయి. కొత్తవారితో ఇంత మంచి చిత్రం తీయడం మాములు విషయం కాదు. దర్శకుడు యదు వంశీకి ఇదే మొదటి సినిమా అంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఈ సినిమా హిట్ అయి అందరికీ లాభాలు తేవాలి' అని కోరారు. చిత్ర సమర్పకురాలు నిహారిక మాట్లాడుతూ 'మూడేళ్ల కష్టం ఈ సినిమా. వీరంతా మూడేళ్లుగా పని చేస్తునే ఉన్నారు. అంతా కష్టపడి మంచి సినిమా చేశాం. ఆగస్టు 9న సినిమాను విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. 'మా సినిమాలో నటించిన 11 మంది సిద్ధులాగా ఎంతో కష్టపడుతుంటారు. మా టెక్నికల్ టీమ్ సపోర్ట్‌తో సినిమాను బాగా తీయగలిగాను. నిహారిక, ఫణి లేకపోతే చిత్రం ఇలా వచ్చేదే కాదు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ సహకారం మరువలేనిది' అని చెప్పారు దర్శకుడు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన యూత్‌ఫుల్ మూవీ ఇదని నిర్మాత ఫణి అడపాక, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ చెప్పారు.

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటించిన చిత్రం 'జ్యూయల్ థీఫ్' సీనియర్ నటి ప్రేమ కీలక పాత్ర పోషించారు. పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఇటీవలే సినిమా టీజర్‌ని, ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'నేను సూపర్‌స్టార్ కృష్ణగారి అభిమానిని. ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ఈ తరం ప్రేక్షకులకు నచ్చే సస్పెన్స్ థ్రిల్లర్. త్వరలోనే విడుదల చేస్తాం' అని చెప్పారు.

'పావలా' శ్యామలకు సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం



ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న సీనియర్ నటి 'పావలా' శ్యామలకు హీరో సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం చేశారు.. తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యుల ద్వారా శ్యామలకు లక్ష రూపాయలు పంపించారు. శ్యామల ఎమోషనల్ అయి 'మా అమ్మాయికి ఆపరేషన్ అయినప్పుడు సాయి దుర్గతేజ్ ఫోన్ చేసి, ధైర్యం చెప్పారు. వచ్చి కలుస్తానన్నారు. చాలా రోజులైంది. మరిచిపోయారేమో అనుకున్నా. గుర్తు పెట్టుకుని సాయం చేసినందుకు ధన్యవాదాలు' అన్నారు.

వాణిజ్య హంగులతో విరాజి



వరుణ్ సందేశ్ కథానాయకుడిగా ఆద్యంత్ హర్ష తెరకెక్కించిన చిత్రం 'విరాజి'. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మీడియాతో ముచ్చటించారు. 'గతంలో మా సంస్థలో వరలక్ష్మి శరత్‌కుమార్‌తో 'శబరి' చిత్రాన్ని నిర్మించాం. మేం నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. వరుణ్ సందేశ్ కొత్తలుక్‌లో కనిపిస్తారు. ఆయన గెటప్‌కు కథలో ప్రాధాన్యం ఉంది. మన సమాజంలోని ఒక అంశాన్ని తీసుకొని కమర్షియల్ కోణంలో సినిమాను తెరకెక్కించాం' అని మహేంద్రనాథ్ చెప్పారు.

హాజరు లేకపోయినా చెల్లింపులు

● సోషల్ ఆడిట్‌లో వెలుగుచూసిన వాస్తవాలు

రామభద్రపురం: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికలో అనేక అక్రమాలు బయటపడ్డాయి. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన పనులపై 22 గ్రామ పంచాయతీల్లో డీఆర్‌పీలు విచారణ చేపట్టారు. డుమా ఏపీడీలు శారదాదేవి, జనార్దనరావు, స్టేట్ రిసోర్సుపర్సన్ మన్మథరావు ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. గొల్లలపేటలో గతంలో మృతి చెందిన వ్యక్తి పేరు మీద బిల్లులు ఇచ్చారని వెల్లడైంది. ఫారంపాండ్ నిర్మించకపోయినా లబ్ధిదారుకు నిధులు చెల్లించారని వెల్లడించారు. కోటశిర్లాం, రామభద్రపురం గ్రామాల్లో మస్తర్లు, హాజరులో సంతకాలు లేనప్పటికీ వేతనాలు చెల్లించినట్టు రుజువు చేశారు. కోటశిర్లాం గ్రామంలో డూప్లెక్స్ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుకు కూడా ఉపాధి నిధులు చెల్లించినట్టు తేటతెల్లమైంది. గతంలో వలంటీర్లుగా పనిచేసిన వారు వారానికి మూడు రోజులే ఉపాధి పనులు చేయాల్సి ఉండగా ఆరు రోజులు చేసినట్టు బిల్లులు తీసుకున్నారని తెలిపారు. హార్టికల్చర్ లేకపోయినా నిధులు చెల్లించడం గమనార్హం. పాత రేగలో విచారణకు వచ్చిన సిబ్బందికి ఫీల్డ్ అసిస్టెంట్ రికార్డులు ఇవ్వకపోవడం, మస్తర్లు లేకుండా 45 మందికి పనిచేసి రెండు నెలలైనా బిల్లులు ఇవ్వలేదని విచారణలో తేలింది. మిర్తివలసలో పైపు కల్వర్టు పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించలేదని సర్పంచ్ మజ్జి రాంబాబు అధికారులను నిలదీశారు. రొంపల్లిలో ఉపాధి పనులకు నిధులు చెల్లించడం లేదని ఎంపీటీసీ భవిరెడ్డి శంకరరావు అధికారుల తీరును తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చుక్క ఈశ్వరమ్మ, ఏపీవో గొలగాని త్రినాథరావు, ఈసీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అధికారులకు సమస్యలు వివరిస్తున్న మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు


సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ కలిశెట్టి

ఢిల్లీలో చంద్రబాబుకు ఎంపీల స్వాగతం

విజయనగరం (ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనేందుకు శుక్రవారం రాత్రి ఢిల్లీ చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు రాష్ట్ర ఎంపీలంతా అక్కడ ఘన స్వాగతం పలికారు. ఢిల్లీ విమానాశ్రయంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో పాటు ఇతర ఎంపీలంతా చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.


బోల్తాపడిన వాహనం

వ్యాను బోల్తా.. ఒకరి మృతి

దత్తిరాజేరు: మరడాం, కోమటిపల్లి మధ్యలో జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం బొలేరో వ్యాను అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామభద్రపురం నుంచి విశాఖ వెళ్తున్న బొలేరో వ్యాను మరడాం, కోమటిపల్లి మధ్యలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, వారిని గజపతినగరం పీహెచ్‌సీకి తరలించారు. వారిలో లోగడ పైడినాయుడు (35) మృతిచెందగా, వేరొక వ్యక్తి కాటం శివకుమార్ చికిత్స పొందుతున్నాడు. వీరిద్దరూ విశాఖపట్టణం జిల్లా మారికవలసకు చెందినవారు. బంధువులకు సమాచారం అందించినట్టు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసుపై డీఎస్పీ విచారణ

భోగాపురం: బాలికను అపహరించిన కేసులో నిందితుడు రాయపురెడ్డి సురేష్‌ను, కుటుంబ సభ్యులను విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు శుక్రవారం విచారించారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ముంజేరుకు చెందిన ఆర్.సురేష్ రెండు నెలల కిందట ఓ బాలికను అపహరించుకుపోయాడు. దీనిపై అప్పట్లో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం రావడంతో మూడు రోజుల క్రితం పోలీసులు అక్కడికి వెళ్లి బాలికను, సురేష్‌ను పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీనిపై పోక్సో కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎ.రవికుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భోగాపురం: డెంకాడ మండలం మోదవలస గ్రామానికి చెందిన మంతిన పైడిశెట్టి (33) ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు సీఐ ఎ.రవికుమార్ తెలిపారు. పైడిశెట్టి నాతవలస టోల్‌గేట్ వద్ద పని చేస్తున్నాడు. గురువారం మోదవలస నుంచి టోల్‌గేట్‌కు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం నుంచి వస్తున్నాడు. సుందరపేట సమీప ఎత్తు బిడ్జి దగ్గర ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో పైడిశెట్టికి బలమైన గాయాలయ్యాయి. విజయనగరం ప్రేవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య దివ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడు ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

రాజాం: నాగావళి నది నుంచి శుక్రవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఈబీ ఎస్ఐ పి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పట్టుకొని సీజ్ చేశారు. వాటిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు క్లబ్‌లు

లక్కవరపుకోట: పాఠశాలల్లో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రహరీ క్లబ్ పేరిట అన్ని హైస్కూళ్లలో 25 మంది చొప్పున బృందాలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు వచ్చాయని ఎంఈవో కూర్మారావు తెలిపారు. ఈ బృందాలు ఎప్పటికప్పుడు రహస్యంగా సమాచారం సేకరించి సంబంధిత పాఠశాల అధికారులకు తెలియజేస్తారని చెప్పారు.

లేఅవుట్‌లో లావాదేవీలకు బ్రేక్

శృంగవరపుకోట: శృంగవరపుకోట పంచాయితీ పరిధిలోని ఓ లేఅవుట్‌లో లావాదేవీలు జరగకుండా హైకోర్టు స్టేటస్‌కో జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా రైతుల సాగుకు పనికి వచ్చే చెరువును లేఅవుట్‌గా తీర్చిదిద్దినట్లు స్థానిక వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ లేఅవుట్‌లో లావాదేవీలు జరగకుండా హైకోర్టు స్టేటస్‌కో విధించింది.

29న పీడీఎస్ బియ్యం వేలం

శృంగవరపుకోట: శృంగవరపుకోట మండల పరిధిలో 6ఎ కేసుల్లో పట్టుబడిన 17.23 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఈనెల 29 సాయంత్రం 4 గంటలకు వేలం వేస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ ఉప తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకున్న వారంతా రూ.2000 చొప్పున ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పౌష్టికాహారంలో రాజీ వద్దు

జామి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో వంట నిర్వాహకులు రాజీ పడొద్దని మండల విద్యాశాఖాధికారి-2 గంగరాజు నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం శిరికిపాలెం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

నూతన కార్యవర్గం

రాజాం: ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం రాజాం తాలుకా నూతన అధ్యక్షులుగా ఎంవీ నాగరాజు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ ఎన్నికల్లో కార్యదర్శిగా పి.గంగారాం, సహాధ్యక్షులుగా వి. శ్రీనివాసరావు, కోశాధికారిగా పి.పాపినాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.కిషోర్, ఉపాధ్యక్షులుగా డి.భీమశంకర్, వి.విద్యాసాగర్, ఎ.వి.సత్యనారాయణ, పీవీ నారాయణమ్మ, సంయుక్త కార్యదర్శులుగా పి.చిరంజీవి, కె.సురేష్, యు.అప్పారావు, జె.రాము, వై.మణికుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహిళల ప్రగతే లక్ష్యం

● ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు శిరీష

విజయనగరం రూరల్: మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలన్నదే తమ లక్ష్యమని ఇన్నర్‌వీల్, రోటరీ ఏక్తా క్లబ్ అధ్యక్షురాలు శిరీష లక్ష్మీశ్రీనివాస్, ఐశ్వర్యలు చెప్పారు. ఈ నెల 24, 25 తేదీల్లో మహిళలకు ఎంబ్రాయిడరీ, ప్రింటింగ్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. క్లబ్‌ల ప్రతినిధులు కల్పన కుక్రేజా, కె.రాధిక, పి.శిరీష, కృష్ణవేణి, పద్మ, ఐశ్వర్య, ఆస్మిత పాల్గొన్నారు.


శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందించిన క్లబ్ ప్రతినిధులు

శాకంబరిగా పైడిమాంబ

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరులతల్లి పైడిమాంబ శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడిలో అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. కాయగూరలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. అమవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

వాసవీ మాతకు అలంకరణ

జామి: మండల కేంద్రమైన జామిలో ఉన్న శ్రీవాసవీ మాతను శుక్రవారం శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.


పైడిమాంబకు పూజలు చేస్తున్న అర్చకులు


శాకంబరి అలంకారంలో వాసవీమాత



రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

బాడంగి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిదని సీపీఎం నాయకులు ఎ.సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం రామచంద్రాపురం గ్రామంలో రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలు తీవ్రంగా ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కీం వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న డీఈఓ

ధర్మవరం ఉన్నత పాఠశాల పరిశీలన

శృంగవరపుకోట రూరల్: ధర్మవరం ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. అక్కడ ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో జరుగుతున్న వర్క్‌షాప్‌ను చూశారు. పాఠశాలల ల్యాబ్, గ్రంథాలయం చూసి సూచనలు, సలహాలు చేశారు. అనంతరం పాఠశాల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమమాహేశ్వరరావు, పీఈటీ శ్రీరాములు, కృష్ణ, పాఠశాల ఛైర్మన్ తగరంపూడి రమణ తదితరులు పాల్గొన్నారు.


రహదారిలో గోతులు కప్పిస్తున్న నాయకులు

టీడీపీ చొరవతో రోడ్డుకు మరమ్మతులు

జామి: భీమసింగి-అలమండ రోడ్డు ఇటీవల దారుణంగా దెబ్బ తిన్నది. ప్రయాణికులు, వాహన చోదకులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గమనించిన టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పోలిపర్తి స్వామినాయుడు, పైడిరాజులు ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారుల దృష్టిలో పెట్టారు. దీంతో వెంటనే వారు స్పందించారు. గోతులను కప్పే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు దగ్గరుండి పర్యవేక్షించి గోతులు కప్పించారు.

బోధనలో మెలకువలు పాటించాలి

వంగర: ఉపాధ్యాయులు బోధనలో మెలకువలు పాటించాలని ఎంఈఓ విజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం లక్ష్మింపేట పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధన తీరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయనతో సిబ్బంది లక్షుంనాయుడు, సంగోజి తదితరులు ఉన్నారు.

నేడు మంత్రి కొండపల్లి రాక

కలెక్టరేట్: రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం జిల్లాలో పర్యటించనున్నా రు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకూ జిల్లా పరిషత్ అతిథి గృహంలో అందుబాటులో ఉంటారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ గజపతినగరం కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

రేపు బీచ్ కబడ్డీ జట్టు ఎంపిక

విజయనగరం టౌన్: వచ్చే నెల 2 నుంచి 4 వరకూ నెల్లూరు జిల్లాలోని ఇందు కూరిపేటలో రాష్ట్రస్థాయి సీనియర్ బీచ్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించ నున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విజయనగరం జిల్లా జట్టును ఈ నెల 28న ఉదయం 9 గంటలకు ఎంపిక చేయనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్య దర్శులు రంగారావు దొర, కేవీ ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 99497 21949 నెంబరును సంప్రదించాలని కోరారు.

మరుగుదొడ్లకు నిధులు మంజూరు

కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సామాజిక మరు గుదొడ్ల నిర్మాణానికి రూ.30 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు కలెక్టరు అంబేద్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు పురుషులకు 10, మహిళలకు 10 వంతున 20 మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

బాధితులకు పరిహారం చెల్లించండి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం వెంటనే చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకళ్యాణి అన్నారు. శుక్రవారం హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే నిమిత్తం మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారులు, డీఎస్పీలు, బాధితులకు నష్టపరిహారం చెల్లించే విషయమై ఆమె ఆరా తీశారు. పోలీసు, రెవెన్యూ అధికారులు బాధితులకు అవగాహన సదస్సు నిర్వహించి తక్షణం వారి పరిహారం కోసం దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు, ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్, డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

బొబ్బిలి: పట్టణంలో శుక్రవారం వేకువజామున ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, తహశీల్దారు త్రినాథరావునాయుడులు తమ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాలను పరిశీలించారు. అప్పయ్యపేట ఇరిగేషన్ కాలువల లీకేజీలను గుర్తించి ఆ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు సోమేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల కొరత తీర్చండి

జామి: మండలంలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయని.. సరిపడా ఎరువులు లేనందున వెంటనే కేటాయించాలని మాజీ జడ్‌పీటీసీ బండారు పెదబాబు సంబంధిత జేడీని కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయనగరంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై జెడీ స్పందించి సోమవారం నుంచి మండలానికి పూర్తి స్థాయిలో ఎరువులు ఇస్తామని తెలిపారన్నారు.

సాంకేతిక నైపుణ్యాలు అవసరం

రామభద్రపురం: విద్యార్థి దశ నుంచే సాంకేతిక నైపుణ్యంపై అవగాహన కల్పించుకోవాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కామేశ్వరరావు అన్నారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా కంప్యూటర్ నమూనాలను విద్యార్థులతో తయారు చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం నాగభూషణరావు, ఉపాధ్యాయ కార్యదర్శి మురళీధరరావు, ఐసీటీ విభాగం నిర్వాహకుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయుడు దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య సేవలపై టాస్క్‌ఫోర్స్

లక్కవరపుకోట: జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు శుక్రవారం కొత్తవలసకు జిల్లా టాస్క్‌ఫోర్సు టీమ్ వచ్చింది. సంతపాలె ం వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. గర్భిణులకు, బాలింతలకు, విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులన్నీ పరిశీలించారు. దెందేరు హైస్కూల్ విద్యార్థులకు రక్తపరీక్షలు చేసి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్సు అధికారులు ధర్మారావు, సత్యవతి, రామానుజంనాయుడు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారి



నిరసన తెలియజేస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘ ప్రతినిధులు

30న మహాధర్నా

విజయనగరం దాసన్నపేట: విజయనగరం మండల పరిధిలోని జొన్నాడ వద్ద టోల్‌గేట్‌ను తొలగించాలని కోరుతూ ఈ నెల 30న మహాధర్నా నిర్వహిస్తున్నామని, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు తెలిపారు. శుక్రవారం కోట వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే మంత్రులకు, శాసనసభ్యులకు, జడ్పీ ఛైర్‌పర్సన్‌లకు వినతిపత్రం అందించామన్నారు. జిల్లా ప్రజానీకానికి టోల్ బాధలు తప్పించాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీఓ విజయలక్ష్మి

వంద రోజుల కార్యక్రమంపై అవగాహన

బొబ్బిలి రూరల్: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం పీఓ జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వందరోజుల కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన కార్యకలాపాలను వివరించారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు ప్రభావతి, నిర్మల, శుభలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లు ముమ్మరం చేయాలి

విజయనగరం రింగురోడ్డు: ఆస్తి, కుళాయి పన్నుల వసూళ్లను ముమ్మరం చేయాలని కార్యదర్శులకు నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుళాయి పన్నుల వసూళ్లలో కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నట్టుగా గుర్తించామన్నారు. దీర్ఘకాలికంగా బకాయిలు ఉన్నవారి కనెక్షన్ తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈ కె.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

1న పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

విజయనగరం రింగురోడ్డు: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆగస్టు 1న ఉదయం 10 గంటలకు పూర్తి చేయాలని సంక్షేమ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశించారు. శుక్రవారం వెల్ఫేర్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీనే శతశాతం పెన్షన్ పంపిణీ చేయాలన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 23,305 మంది పింఛనుదారులు ఉన్నారని.. వారిలో 110 మంది మరణించగా, మరో 117 మంది అందుబాటులో లేకపోవడంతో గత నెలలో 99.3 శాతం పంపిణీ చేశామన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, టీపీఆర్ఓ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నేడు డ్రగ్స్ నియంత్రణపై సమీక్ష

విజయనగరం క్రైం: డ్రగ్స్‌ను నియంత్రించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు, ఒకేషనల్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటలకు ధర్మపురి జంక్షన్ సమీపంలో గల అపెక్స్ కళాశాలలో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్టు ఏపీ బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగుల జీతాలు నిలిపివేయండి

విజయనగరం దాసన్నపేట: ప్రభుత్వ ఆదేశాలు తుంగలో తొక్కిన దత్తిరాజేరు మండల అధికారులు జీతాలు నిలిపివేయాలని గో సంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్ర వారం కంటోన్మెంట్‌లోని రెల్లివీధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానాపురం సంతకు ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు లేవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న దీనిని ఉన్నతాధికారులు నిలుపుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మద్దిల సోంబాబు, పైడితల్లి, మజ్జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి చేయూత

రేగిడి: వావిలవలస రాహుల్ సౌరబ్ అన్నదాన సత్రానికి తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈవో శేఖర్‌బాబు బాసటగా నిలిచారు. కోవిడ్ కాలం నుంచి 1952 రోజులుగా వావిలవలస, పరిసర గ్రామాల అనాథలకు, నిరుపేదలకు ఈ సత్రంలో నిత్యన్నదానం చేస్తున్నారు. ఈ సత్రానికి డిప్యూటీ ఈఓ 200 కేజీల బియ్యం వితరణగా అందించినట్టు సామాజిక కార్యకర్త పాలూరి సిద్దార్థ శుక్రవారం విలేకరులకు తెలిపారు.

నేడు ఐటీఐలో రెండో విడత కౌన్సెలింగ్

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శనివారం 8 గంటల నుంచి రెండో విడత అడ్మిషన్లకు సంబంధించి విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణరావు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులతా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

దోమల నియంత్రణకు చర్యలు

విజయనగరం రింగురోడ్డు: నగరంలో దోమల నియంత్రణకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి నియంత్రణ చర్యలను ముమ్మరం చేశామన్నారు. ఇప్పటి వరకూ నాలుగు డివిజన్లలో ఫాగింగ్ పూర్తయిందన్నారు.

వరినాట్లపై రైతులకు అవగాహన

బాడంగి: కోటిపల్లి గ్రామంలో వరినాట్లు వేసే విధానంపై మండల వ్యవసాయాధికారి కె.శిరీష రైతులకు అవగాహన కల్పించారు. వంగపండు కాంతమ్మకు చెందిన పొలంలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏ వై.అనూష, రైతులు పాల్గొన్నారు.

అలజంగి సచివాలయం తనిఖీ

బొబ్బిలి రూరల్: అలజంగి సచివాలయాన్ని ఎంపీడీఓ రవికుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును, సిబ్బంది సేవలపై ఆరా తీశారు. వచ్చే నెల 1 న పెన్షన్ల పంపిణీకి సంబంధించి సూచనలు చేశారు.

ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండాలి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఉచిత ఇసుక పంపిణీ పథకం అమలుపై భూగర్భ గనులశాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా కలెక్టర్లతో ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుకను లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తుందని, రవాణా ఖర్చులు సాధ్యమైనంత తక్కువగా ఉండేటట్టు చర్యలు తీసుకుని, ప్రజలకు సరసమైన ధరలకు అందించాలని సూచించారు. రానున్న ఆరు నెలల్లో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఇసుక నిల్వలు సిద్ధంగా ఉంచాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గుర్తించిన రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుకను సేకరించాలని, పర్యావరణానికి హాని కలగకుండా అక్రమ రవాణాను అడ్డుకోవాలని తెలిపారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం స్టాక్ పాయింట్ లేదని, జిల్లాకు రావాల్సిన ఇసుకను ప్రస్తుతం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి తీసుకు వస్తున్నారని తెలిపారు. జిల్లాలో డీసిల్టరేషన్ ద్వారా ఇసుక రీచ్‌లను గుర్తించి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, ఆర్డీవోలు కె.హేమలత, డీవీ రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోండి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుని విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చునని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాయితీపై అందిస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం గృహ వినియోగదారులకు విద్యుత్ చార్జీల భారం తగ్గించుకొనేందుకు చక్కని అవకాశం అన్నారు. రాయితీని పొంది ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవచ్చునన్నారు. కనీసం పది చదరపు మీటర్లు లేదా వంద చదరపు అడుగుల స్థలంలో ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మువ్వల లక్ష్మణరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ వీవీ కిషోర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాత వైద్య విధానంలో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న భానుమూర్తి

పార్వతీపురంటౌన్: ఆర్టీసీ ఉద్యోగులకు పాత వైద్య విధానంలో సౌకర్యాలు కల్పించాలని ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి కోరారు. శుక్రవారం స్థానిక ఎన్జీవో భవనంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెజార్టీ ఉద్యోగులు కోరుకున్న ప్రభుత్వం రాష్ట్రంలో పాలన చేపట్టిందన్నారు. 1/2019 సర్క్యులర్‌ని కొందరు అధికారులు అమలు చేయకుండా పక్కన పెడుతుండడం బాధాకరమన్నారు. ఇటీవల అధికారులు ఉద్యోగులపై తీసుకుంటున్న క్రమశిక్షణ చర్యల విధానాన్ని సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఈయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గారావు, పార్వతీపురం డిపో అధ్యక్ష, కార్యదర్శులు కె.నర్సింగరావు, డీఏ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన

పాలకొండ: ఓని గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గ్రామ సమీపంలో ఉన్న పొలాలకు తీసుకుని వెళ్లి, వ్యవసాయంపై అవగాహన కల్పించారు. గ్రామ రైతు కనపాక వెంకటరావు వ్యవసాయ క్షేత్రంలో ఉన్న పత్తి, వరి, బెండ, చిక్కుడు పంటల సాగు విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోగుల సూర్యనారాయణ, పాలవలస శారదకుమారి, దానేటి పుష్పలత, సిద్దాబత్తుల వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి సమస్యలు


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న మధుసూదనరావు, తదితరులు

గరుగుబిల్లి: మండలంలోని ప్రధాన సమస్యలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లామని పార్టీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, అరకు తెలుగుదేశం పార్టీ ప్రతినిధి, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబు తెలిపారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో నాగూరు, చింతలబెలగాం, తోటపల్లి ప్రాంతాల్లో మూడు ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయాలని కోరామని చెప్పారు. వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సమస్యల పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యడ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

సాలూరు: మున్సిపల్ కార్యాలయంలో ఇష్టారాజ్యాంగా విధులు నిర్వహిస్తున్న అధికారులపై చర్యలు తప్పవని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆమె.. సిబ్బంది ఆలస్యంగా విధులకు రావటాన్ని గమనించారు. అనంతరం ఆమె మున్సిపల్ మేనేజర్ రాఘవాచార్యులతో మాట్లాడారు. 'మున్సిపల్ మేనేజర్‌గా మీ విధులు అస్సలు సరిగ్గా నిర్వహించటం లేదని, కార్యాలయంలో ఏం జరుగుతుందో అస్సలు మీకు పట్టనట్టు వ్యవహరించడం సరికాదు. సిబ్బందితో సరిగ్గా పనిచేయించుకోలేక పోతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయ ఆవరణ అస్సలు పరిశుభ్రంగా ఉండటం లేదని, పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆఫీస్ అసిస్టెంట్ శివశంకర్‌కు ఆదేశించారు. పరిశుభ్రంగా లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మొబైల్ యాప్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

గరుగుబిల్లి: విద్యుత్ వినియోగదారులు ఇక నుంచి మొబైల్ యాప్ ద్వారా బిల్లులు చెల్లించాల్సి ఉందని మండల విద్యుత్‌శాఖ ఏఈ బి.శంకరరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, క్రెడిట్, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు నేరుగా చెల్లించవచ్చని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా వినియోగదారులు చెల్లిస్తున్న బిల్లులకు ఎటువంటి అదనపు చార్జీలు వర్తించవని ఆయన తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి సన్నాహక సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ మనోజ్

రాయగడ: స్థానిక జడ్పీ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ నిర్వాహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజా సంబంధాల అధికారి బసంతకుమార్ ప్రధాన్ గత ఏడాది వేడుకల నిర్వాహణ వివరాలను చదివి వినిపించారు. ఈ ఏడాది కూడా ఎలాంటి ఆటంకం లేకుండా వేడుకలు నిర్వహిద్దామని, వివిధ క్రీడా పోటీలు నిర్వహిద్దామని కలెక్టర్ మనోజ్ వెల్లడించారు. 11, 12, 13 తేదీల్లో కవాతు సాధన నిర్వహించాలని అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ మేరకు వివిధ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర చంద్ర రోయిత్, సబ్‌కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రదేవి, జడ్పీ అధ్యక్షురాలు సరస్వతిమాఝి, పురాధ్యక్షుడు మహేష్‌పట్నాయక్, పోలీసు అధికారులు, వివిధ పాఠశాలల, కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒడిశా


దేశసేవ ప్రతిఒక్కరి బాధ్యత

● అమర జవాన్లకు ఘన నివాళి

గుమ్మలక్ష్మీపురం: దేశానికి సేవ చేయడం ప్రతిఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.శ్రీవరం అన్నారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్గిల్ దివస్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు పిరమిడ్ ఆకారంలో జాతీయ పతాకాన్ని గాలిలో ఎగురవేశారు. వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. **పార్వతీపురంటౌన్:** దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన కార్గిల్ యుద్ధంలో మరణించిన వీరజవానులకు రుణపడి ఉంటామని జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ చలపతిరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులతో కార్గిల్‌లో అశువులుబాసిన వీర జవానులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి గుప్తా, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు. **భామిని:** కార్గిల్ విజయ దివస్ సందర్భంగా ఏపీ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం కార్గిల్ అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ అధ్యక్షతన విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు పెరేడ్ నిర్వహించి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ కార్గిల్ విజయంపై వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించారు.



పార్వతీపురంటౌన్: వీర జవానులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం


భామిని: అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం



గుమ్మలక్ష్మీపురం: పిరమిడ్ ఆకారంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న విద్యార్థులు

ప్రకృతి వ్యవసాయంతో లాభదాయకం

భామిని: ప్రకృతి వ్యవసాయం చేస్తే రైతులకు లాభదాయకమని జిల్లా వనరుల కేంద్ర సమన్వయ సంచాలకుడు అర్.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల వినియోగంపై శిక్షణ అందించారు. వ్యవసాయ మార్కెట్ ద్వారా పంట దిగుబడి అనుకూలంగా ఉంటుందని, తక్కువ వర్షాలు కురవడం వల్ల ఆరు తడి పంటలైన కందులు, రాగోలు, మొక్కజొన్న వంటి వాణిజ్య పంటలపై దృష్టిపెట్టాలని సూచించారు. పాలకొండ వ్యవసాయశాఖ ఏడీ రత్నకు మారి, మండల వ్యవసాయాధికారి సింహాచలం రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ సిబ్బంది ఎర్రన్న, దుర్గా ప్రసాద్, భవానీ, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను ఉపయోగించండి

వీరఘట్టం: విక్రంపురం గ్రామంలో శుక్రవారం రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రైతులు తెగుళ్ల బారి నుంచి పంటలను ఎలా సంరక్షించాలో సూచనలు చేశారు. అదే విధంగా నేల సారవంతంగా ఉండేందుకు సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ శారద, భారతి, శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి సౌజన్య వ్యవసాయ సహాయకులు అరవింద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో శుక్రవారం పాలకొండ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సుమారు 300 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మలేరియా తదితర రక్త పరీక్షలు నిర్వహించారు. అందరిలో కేవలం ఒక్క విద్యార్థికి మాత్రమే మలేరియా పాజిటివ్ ఉన్నట్టు గుర్తించి, మందులు అందించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.హరగోపాల్, ఆరోగ్య సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వి.అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలి

మక్కువ: ఇటీవల దుగ్గేరు గ్రామానికి చెందిన ఆశ్రమ పాఠశాల విద్యార్థి పంచాది రాఘవ ఈనెల 21న మలేరియాతో బాధపడుతూ కేజీహెచ్‌లో మృతిచెందాడు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు శుక్రవారం దుగ్గేరులోని విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.25లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన్యం జిల్లాలో వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా వైద్య శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఆశ్రమ పాఠశాలలో గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఏఎన్ఎంలను నియమించాలని కోరారు. మలేరియా నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు తాడంగి ప్రభాకర్, సొండి గౌరమ్మ, మండల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

వీరఘట్టం: వండువ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కిశోర బాలికల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పరిశుభ్రత, రక్షణకు సంబంధించిన సూచనలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో బి.సింహాలమ్మ, సూపర్‌వైజర్లు ఎస్.రాజేశ్వరి, జె.జనామ్మ, అంగన్వాడీలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

53 పంచాయతీల్లో సమస్యలపై దృష్టిపెట్టాలి


ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందిస్తున్న జనసేన మండల అధ్యక్షుడు విశ్వనాథం, తదితరులు

సీతంపేట: మండలంలోని 53 పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మండంగి విశ్వనాథం కోరారు. ఈ మేరకు ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన రాహుల్‌కుమార్‌రెడ్డిని వారు శుక్రవారం తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, సమస్యలను వివరించారు. ప్రధాన సమస్యలైన రోడ్లు, తాగునీరుపై చర్చించారు. దీనిపై పీవో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సవర ప్రసాదరావు, మండల ప్రధాన కార్యదర్శి మండంగి నరేష్, అరుణ్‌కుమార్, గణేష్, రమేష్, సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

వాహన తనిఖీలు

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపై కొమరాడ ఎస్ఐ నీలకంఠం శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మద్యం అక్రమంగా రవాణాను నియంత్రించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

మొబైల్ వినియోగం తగ్గించండి

వీరఘట్టం: వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎస్ఐ పక్రుద్దీన్ శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ వినియోగం తగ్గించాలని, చదువుపైనే దృష్టి సారించి కళాశాలకు, ఉపాధ్యాయులకు పేరు తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్, లెక్చరర్లు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

గరుగుబిల్లి: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 28వ తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం వేలం వేయనున్నట్టు ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ వివిధ సందర్భాల్లో పట్టుబడిన ఐదు బైకులు, రెండు ఆటోలను వేలం వేస్తున్నామని చెప్పారు. ఉత్సాహవంతులు ఉదయం 9 గంటలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు.

నేడు సాలూరు ఐటీఐలో కౌన్సెలింగ్

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 27న ఉదయం 9 గంటలకు మిగిలి ఉన్న సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ మోటార్ వెహికల్, డ్రాఫ్ట్‌మేన్ సివిల్, ఏసీ మెకానిక్, డీజిల్ వెల్డర్, కోపా కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

కారు దొంగ అరెస్టు

శ్రీకాకుళం క్రైం: నగరంలో కారు దొంగతనం చేసిన వ్యక్తి సింగుపురం వద్ద శ్రీకాకుళం రూరల్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే... కొత్తరోడ్డు సమీపంలో ఉన్న చక్రధర్ ఐటీఐ యజమాని యాళ్ల చక్రధర్ ఈ నెల 20వ తేదీ రాత్రి కళాశాల వద్ద కారును పార్కు చేసి, కారుకే తాళాలు వదిలేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన కట్టగ సంతోష్ ఈ కారును దొంగిలించాడు. దీనిపై చక్రధర్ 21న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సింగుపురం సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఎస్ఐ వాహన తనిఖీలు చేస్తుండగా.. ఏపీ 39 బీటీ 0634 నెంబరు గల వాహనం ఎదురైంది. ఈ కారును ఆపేందుకు ఎస్ఐ తొలుత ప్రయత్నించగా, [illegible] యేందుకు కారులో ఉన్న సంతోష్ ప్రయత్నించాడు. సరిగ్గా సింగుపురం బ్రిడ్జి మీద పోలీసులు కారును అడ్డగించి, కారును దొంగిలించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. తాను చోరీకి పాల్పడినట్టు సంతోష్ అంగీకరించాడు. దీంతో ఎస్ఐ కారును స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టుకు అప్పగించారు.

పారిశుధ్య పనులు పక్కాగా చేయాలి

పాలకొండ: గ్రామాల్లో పారిశుధ్య పనులను పక్కాగా చేయాలని ఎంపీడీవో రామకృష్ణ, మండల ప్రత్యేక అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. మండలంలోని అంపిలి, అన్నవరం గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను వారు శుక్రవారం పరిశీలించారు. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని ఎంపీడీవో గ్రామస్థులకు సూచించారు. వేడినీరు, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. జ్వరాలు రెండు రోజులు కంటే ఎక్కువ రోజులు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం బుక్కురు గ్రామంలో సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఈవోపీఆర్డీ సూర్యనారాయణ ఉన్నారు.


కొమరాడ: కుండీలోని నీటిని పారబోస్తున్న దృశ్యం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

కొమరాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం కొమరాడలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పూడికల తొలగింపు

వీరఘట్టం: విక్రంపురం గ్రామంలో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న కాలువలోని పూడిలను తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మణికంఠనాయుడు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

గరుగుబిల్లి: పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా మరుపెంట గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్య వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు

సీతానగరం: పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో కాలువల్లో పూడికల తొలగింపు, బ్లీచింగ్ జల్లడం, దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టడం వంటి కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నామని ఎంపీడీవో ఈశ్వరరావు, ఈవోపీఆర్డీ కుమార్‌వర్మ తెలిపారు. అలాగే ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

భామిని: పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా స్థానిక వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి శశికుమార్ శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. వసతిగృహాలు పరిశుభ్రంగా ఉంచాలని, వంటశాలలను తరచూ శుభ్రం చేయాలన్నారు. ఎంపీడీవో కిషోర్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

సీతంపేట: మలేరియా దోమల నివారణకు ఐఆర్ఎస్ ద్రావణం పిచికారీ చేయిస్తున్నామని ఎంపీడీవో గీతాంజలి తెలిపారు. దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న టిటికుపాయి, కొత్తకోట, కుసుమూరు గ్రామాల్లో ఐఆర్ఎస్ ద్రావణం పిచికారీ కార్యక్రమం ఆమె శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాముడుగూడలో వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు ప్రజ్ఞ

కురుపాం రూరల్: సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.ప్రజ్ఞ విరివిగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. దీనిలోభాగంగా శుక్రవారం జి.శివడ పంచాయతీ రాముడుగూడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గిరిజనులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పలువురికి రక్త పరీక్షలు చేసి, మందులు అందజేశారు. దోమ తెరలు వాడాలని, పాముకాటుకు, కుక్కకాటుకు మందులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.